క్లుప్తంగా

మాజీ ఉప రాష్ట్రపతిని కలిసిన మంత్రి ఆనం

వెంకటాచలం: మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో జరిగే వార్షికోత్సవ వేడుకలకు ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రానున్న నేపథ్యంలో ఏర్పాట్లపై వారు చర్చించారు.

పౌరసరఫరాల గోదాము తనిఖీ



స్టాక్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని పౌరసరఫరాల గోదామును మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాక్‌కు సంబంధించిన రికార్డులు పక్కాగా ఉండాలన్నారు. ఎలాంటి అవకతవకలు జరిగినా సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం



మనుబోలు: మండల కేంద్రంలోని కోదండరామపురం దేవాంగులవీధిలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో అమ్మవారి పంచలోహ విగ్రహం తయారీ కోసం దాతలు అక్కిశెట్టి నరేంద్ర, మానసాదేవి రూ.లక్ష విరాళాన్ని శుక్రవారం అర్చకుడు శ్రీనివాసులుకు అందజేశారు. దాతలను పోలేరమ్మ కమిటీ సభ్యులు అభినందించారు. వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకుని పోలేరమ్మకు పంచామృతాలతో అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు.

పూరిల్లు దగ్ధం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని నాగమాంబపురం గ్రామంలో ఓ మహిళకు చెందిన పూరిల్లు శుక్రవారం తెల్లవారుజామున దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.. మహిళ తన మనుమరాలితో కలిసి ఇంట్లో నిద్రిస్తోంది. ఈ సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. స్థానికుల సహాయంతో వారిద్దరూ ఇంట్లో నుంచి ప్రాణాలతో బయట పడ్డారు. మంటల కారణంగా టీవీ, బీరువా ఇతర వస్తువులు కాలిపోయాయి. రూ.50 వేల నష్టం వాటిల్లింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు. తహసీల్దార్ ఆదేశాలతో స్థానిక వీఆర్వో వెంకటేశ్వర్లు వివరాలు సేకరించారు.

83 మద్యం బాటిళ్ల స్వాధీనం

తోటపల్లిగూడూరు: మండలంలోని వరకవిపూడి పంచాయతీ అనంతపురం గ్రామంలో ఓ ఇంట్లో ఉన్న అక్రమంగా నిల్వ ఉంచిన 83 మద్యం బాటిళ్లను పోలీసులు గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై జంపాని కుమార్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రావు అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా మద్యం బాటిళ్లు ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. అతడిని అరెస్ట్ చేశారు.

అన్నం పెట్టు.. ఆదుకో..

'ఆకలన్న వాడికి అన్నం పెట్టవయ్యా.. ఆపదలో ఉన్నవాడిని ఆదుకోవయ్యా..' ఈ మాటలు చెప్పింది వెంకయ్య స్వామి. ఇలా ఆయన ప్రజలకు ఎన్నో నీతి బోధనలు చేశారు. అవధూతకు మండలంలోని గొలగమూడిలో ఆశ్రమం ఉంది. ఇది దక్షిణ భారతదేశంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. ఏటా భక్తుల సంఖ్య పెరుగుతోంది. తెలుగు రాష్ట్రాల ప్రజలే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ప్రతి శనివారం భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీగా మారింది.



ప్రత్యేకాలంకరణలో వెంకయ్య స్వామి

- ఎన్నో నీతి బోధనలు చేసిన వెంకయ్య స్వామి
- అవధూతకు రేపటి నుంచి 42వ ఆరాధన మహోత్సవాలు
- భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు



గొలగమూడిలోని ఆశ్రమం (ఫైల్)

వెంకటాచలం: జిల్లాలోని చేజర్ల మండలం నాగులవెల్లటూరు గ్రామానికి చెందిన పెంచలయ్య, పిచ్చమ్మ దంపతుల కుమారుడు వెంకయ్య. చిన్నతనం నుంచే నీతి బోధనలు చేస్తూ మహిమలు కూడా చూపేవారు. ఎవరైనా చెడ్డ పనులు చేస్తే వారికి ఇలా చేయడం మంచి లక్షణం కాదని, చేతనైనంత వరకు మంచి చేయాలని చెప్పేవారు. తొలినాళ్లలో ఆయన్ను గ్రామస్తులు పిచ్చి వెంకయ్య అంటూ పట్టించుకునే వారు కాదు. వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ నెలల తర్వాత గ్రామానికి వెళ్లేవారు. చివరికి ఆయన గొలగమూడి గ్రామంలో స్థిరపడ్డారు. ఎక్కడ తిరిగినా రాత్రి ఈ ఊరికి వచ్చేవారు.

మంచి చేయాలని చెబుతూ..

వెంకయ్య స్వామి తన వద్దకు వచ్చే వారికి నీతి బోధనలు చేసేవారు. వర్షాలు పడే సమయం గురించి చెప్పడం, ఆకలిగా ఉందని ఎవరడిగినా లేదనకుండా అన్నం పెట్టాలనేవారు. అలాగే ఆపదలో ఉన్న వారికి తోచినంత సాయం చేసి ఆదుకోవాలని చెప్పేవారు. కాలక్రమేణా వెంకయ్య మాటలను ప్రజలు విశ్వసించడం ప్రారంభించారు. ఆయన చివరి రోజుల్లో చెప్పిన మాటలు కచ్చితంగా జరిగాయని మహిమల గురించి ఇతర ప్రాంతాల వారికి తెలిసింది. దీంతో భక్తుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు.

కార్యక్రమాలిలా..

ఆదివారం ఉదయం సర్వభూపాల వాహనసేవ, రాత్రి కల్పవృక్షవాహన సేవ, 19న ఉదయం సూర్యప్రభ వాహనసేవ, రాత్రి చంద్రప్రభ వాహనసేవ, 20న ఉదయం హనుమంత వాహనసేవ, రాత్రి హంసవాహనసేవ, 21న ఉదయం చినశేష వాహనసేవ, రాత్రి గజ వాహనసేవ, 22న ఉదయం అశ్వ వాహనసేవ, రాత్రి పెదశేష వాహనసేవ, 23న ఉదయం సింహ వాహనసేవ, రాత్రి గరుడ వాహన సేవ, చివరి రోజైన 24న ఆరాధన మహోత్సవం జరుగుతాయి. ఉదయం 10 గంటలకు రథోత్సవం నిర్వహిస్తారు. రాత్రి తెప్పోత్సవం జరుగుతుంది.

ఏర్పాట్లు చేస్తున్నాం



42వ ఆరాధన మహోత్సవాలకు భక్తులు భారీ స్థాయిలో రానున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేస్తున్నాం. తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. వైద్యసేవలు అందుబాటులో ఉంచుతున్నాం. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నాం.

– పి.బాలసుబ్రహ్మణ్యం, వెంకయ్య స్వామి ఆశ్రమ ఈఓ

మారిన రూపురేఖలు

వెంకయ్య స్వామి ఆశ్రమం అభివృద్ధి చెందుతోంది. ఇక్కడికి భక్తులు నిత్యం వస్తున్నారు. శనివారం రోజు వేలాది మంది విచ్చేయడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతి సంవత్సరం ఆగస్ట్ 18 నుంచి 24వ తేదీ వరకు ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తుంటారు. వీటికి లక్షలాది మంది విచ్చేస్తారు. ఈ ఏడాది ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆశ్రమ కార్యనిర్వాహణాధికారిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పి.బాలసుబ్రహ్మణ్యం 18 ఏళ్ల క్రితం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇక్కడ ఎన్నో పనులు చేపట్టారు. ఏటా రూ.కోట్ల ఆదాయం సమకూరడంతో భక్తుల కోసం అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు. వసతి గృహాలు, కల్యాణ మండం నిర్మాణాలు చేసి అందుబాటులో ఉంచారు. ఆకలిగా ఉన్నవారికి అన్నం పెట్టాలనే వెంకయ్య స్వామి సూక్తిని ఆశ్రమంలో నిత్యం అమలు చేస్తున్నారు. రోజూ భక్తులకు అన్నదానం చేస్తారు.



ఆశ్రమానికి సమీపంలో నిర్మించిన వసతి గృహాలు

నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కోల్‌కతాలోని ఆర్జీకార్ మెడికల్ కాలేజీలో పీజీ చేస్తున్న విద్యార్థిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అహ్మద్‌బాబు అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత పెన్నా లెవెన్స్



ట్రోఫీ అందుకుంటున్న జట్టు సభ్యులు

కోవూరు: స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో భాగంగా మండలంలోని గంగవరం గ్రామంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను యువత కడింపాటి అన్వేష్, తలారి స్వదీప్, అన్నం ప్రసాద్, షేక్ మస్తాన్ తదితరులు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో పోతిరెడ్డిపాళేనికి చెందిన పెన్నా లెవెన్స్ గెలిచింది. రెండో స్థానంలో గంగవరం యూత్, మూడో స్థానంలో దామరమడుగు యూత్ నిలిచాయి. శుక్రవారం వారికి బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథి గూటూరు శ్రీధర్‌నాయుడిని నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో జానా వెంకటేశ్వర్లుగౌడ్, అజగంటి శ్రీనివాసులు, శివకుమార్, మధుసూదన్‌రెడ్డి, గోసెల ప్రసన్నకుమార్, తలారి బాబు, గంగపట్నం విజయ్ కుమార్, పూల రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాల అందజేత

కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో పది పరీక్షల ఫలితాల్లో ఇంగ్లిష్, తెలుగు మీడియంలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు దాతల సహకారంతో శుక్రవారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. 1980లో పాఠశాల ఉత్తమ విద్యార్థి స్వర్గీయ గునపాటి సుధామణి జ్ఞాపకార్థం సహ విద్యార్థి సత్యనారాయణరెడ్డి రూ.30 వేల నగదు ప్రోత్సాహకాలు ఇచ్చారు. మొదటి స్థానాలు సాధించిన బండ్ల శ్రీలేఖన, సవర్ల రేవంత్‌కు రూ.9 వేల వంతున, రెండో స్థానంలో వచ్చిన కుప్పా శశిధర్, నెల్లూరు తరుణ్‌కు రూ.6 వేల వంతున నగదు ప్రోత్సాహమిచ్చారు. అదేవిధంగా గునపాటి శ్యామ్‌సుందర్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు కార్తీక్‌రెడ్డి, చేతన్‌రెడ్డిలు రూ.5 వేలు ఇవ్వగా తెలుగు మీడియంలో మొదటి మూడు స్థానాలు సాధించిన రేవంత్, తరుణ్, వి.మధుకు రూ.2,500, రూ.1,500, రూ.1,000 చొప్పున ప్రోత్సాహకాలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గరికపాటి రాజా, విద్యా కమిటీ వైస్ చైర్మన్ బాషా, ప్రధానోపాధ్యాయుడు మోహన రామలింగయ్య, టీచర్ తిరుమలయ్య, నాయకుడు కట్టా ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదు అందజేస్తున్న దాత

కేసీ నరసింహన్‌కు అభినందనలు

వెంకటాచలం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నెల్లూరుకు చెందిన సంతానం బుక్ డిపో అధినేత కేసీ నరసింహన్ అట్టముక్కలతో తయారు చేసిన జాతీయ చిహ్నాన్ని వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. మూడునెలల సమయం వెచ్చించి దీనిని రూపొందించానని నరసింహన్ శుక్రవారం వెల్లడించారు. ఇది కొత్త పార్లమెంట్ భవనంలో ఆవిష్కరించిన జాతీయ చిహ్నాన్ని పోలి ఉందని నరసింహన్‌ను వెంకయ్యనాయుడు అభినందించారు.



అట్టముక్కలతో చేసిన జాతీయ చిహ్నాన్ని వెంకయ్యనాయుడికి అందజేస్తున్న నరసింహన్

సమాజసేవలో భాగం కావాలి

- మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు

వెంకటాచలం: ప్రతి ఒక్కరూ సమాజసేవలో భాగం కావాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయ సమితి (హైదరాబాద్), స్వర్ణభారత్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జైపూర్ ఫుట్ కృత్రిమ అవయవాల అమరిక శిబిరాన్ని వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో శుక్రవారం రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి వెంకయ్యనాయుడు ప్రారంభించారు. వీల్ చైర్స్, వాకర్లు తదితరాలను పలువురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ సంపదతోపాటు మన నైపుణ్యంలో కొంత భాగాన్ని కూడా సమాజం కోసం కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. నైపుణ్యాభివృద్ధితోనే యువత సాధికారితతోపాటు, నవభారత నిర్మాణం త్వరితగతిన సాకారం అవుతుందని తెలియజేశారు. రామనారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లా ప్రజలకు స్వర్ణభారత్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను కొనియాడారు. కృత్రిమ పరికరాల అమరిక శిబిరం నిర్వహించడం మంచి కార్యక్రమమని అభినందించారు. కార్యక్రమంలో స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, ట్రస్టీ అట్లూరి అశోక్, భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయ సమితి కార్యదర్శి ఇంద్రకుమార్ జైన్, ప్రదీప్ జైన్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో వెంకయ్యనాయుడు, రామనారాయణరెడ్డి తదితరులు

భక్తిశ్రద్ధలతో..

- ఆలయాల్లో శ్రావణమాస పూజలు
- సామూహికంగా వరలక్ష్మీవ్రతం

పొదలకూరు: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా వివిధ ఆలయాల్లో విశేష రూపాల్లో కొలువైన ఆదిపరాశక్తికి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వరలక్ష్మీవ్రతాన్ని సామూహికంగా చేపట్టారు. భక్తులకు అన్నదానాలు చేశారు. పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మహిళా భక్తులు సామూహిక కుంకుమార్చనలో పాల్గొని వ్రతాన్ని ఆచరించారు. సంగం మార్గం తోడేరు పార్వతీదేవి దేవస్థానంలో, కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించారు. దేవస్థానానికి ఊరేగింపుగా కలశాలను తీసుకొచ్చారు. అయ్యప్పనగర్ శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు జరిగాయి. ఆలయ చైర్మన్ మాలకొండారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. రామమందిరంలో మహిళా భక్తులు వరలక్ష్మీవ్రతం చేశారు.

- **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీవ్రతం వైభవంగా జరిగింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన, పల్లకీసేవ ఘనంగా జరిగాయి. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాలను ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.
- **మనుబోలు:** మండలంలోని విష్ణాలయంలో అర్చకులు హనుమాచార్యులు శుక్రవారం తెల్లవారుజామున పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమానికి ఆమంచర్ల సుధాకర్ రెడ్డి ఉభయకర్తగా వ్యవహరించారు.
- **ముత్తుకూరు:** శ్రావణ శుక్రవారం వరలక్ష్మీవ్రతంతో తెలుగింటి వాకిళ్లు పులకించిపోయాయి. భక్తిశ్రద్ధలతో పండగను చేసుకున్నారు. వరలక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.
- **ఇందుకూరుపేట:** మండలంలోని గంగపట్నం చాముండేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం పంచామృతాభిషేకం, పూలంగిసేవలు జరిగాయి. ఉభయకర్తలుగా రాముడుపాళేనికి చెందిన జాజుల శ్రీనివాసులు – కామాక్షమ్మ దంపతులు వ్యవహరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. పుటికం నాగేశ్వరరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి సుజాతమ్మ, కుటుంబసభ్యులు ఉభయదాతలుగా ఉన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే ఇందుకూరుపేట శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో అర్చకులు ఉదయగిరి వెంకటశేషాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



జొన్నవాడలో వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న మహిళలు



పొదలకూరు: ప్రత్యేకాలంకరణలో పార్వతీదేవి



మనుబోలు మండలంలో..

కంది పంట.. ఆదుకుంటుంది

- మినుములో అంతర పంటగా వేస్తే ఎంతో మేలు
- ఎకరాకు నాలుగు బస్తాల దిగుబడి
- క్వింటా రూ.11 వేలు ధర



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు వెన్నపూస దయాకర్ రెడ్డి, పొదలకూరు మండలంలోని కల్యాణపురం వాసి. వ్యవసాయం చేస్తుంటాడు. గతేడాది ఏఓ వాసు సూచన మేరకు ప్రయోగాత్మకంగా మినుము సాగు చేపట్టారు. అంతర పంటగా పది ఎకరాల్లో కందిని సాగు చేశారు. మూడు నెలలకు మినుము కోత వచ్చింది. అయితే రైతు ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. కానీ కంది మాత్రం 40 బస్తాలు దిగుబడి అయ్యింది. ఫలితంగా సుమారు రూ.2.80 లక్షలు రైతుకు ఆదాయం వచ్చింది. అంతర పంటల సాగు వల్ల మెట్టభూములున్న రైతులు అపరాలసాగులో నష్టపోకుండా వ్యవసాయం చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది.



కంది పంట (ఫైల్)

పొదలకూరు: వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు రైతులు ఆధునిక వ్యవసాయం చేపడితే లాభాలు గడించే అవకాశం ఉంది. పెట్టుబడులు తగ్గడంతోపాటు నష్టాలను పూడ్చుకునే వెసులుబాటు కలుగుతోంది. మండలంలో పెన్నార్ డెల్టా ప్రాంతంలో రైతులు వరిసాగులో ఆధునిక పద్ధతులు పాటించి దిగుబడి సాధిస్తున్నారు. కాగా మెట్టప్రాంతానికి చెందిన రైతులు మినుములో అంతర పంటగా కందిని సాగు చేసి లాభాల బాట పట్టాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే కొందరు ఆ దిశగా ప్రయత్నాలు కూడా చేస్తున్నారు.

ఇలా చేస్తే..

మెట్ట పంటల సాగును తగ్గిస్తున్న రైతులు రబీలో మినుము, పెసర సాగు చేపడితే అంతర పంటగా కందిని విత్తితే అకాల వర్షాలు కురిసినా నష్టాలను పూడ్చుకునే అవకాశం ఉంటుందనేది వ్యవసాయ శాఖ అధికారుల మాట. గతంలో కల్యాణపురం గ్రామంలో ప్రయోగాత్మకంగా మినుములో అంతర పంటగా కంది సాగు చేపట్టిన రైతు లాభాలు గడించారు. వ్యవసాయ శాఖ అధికారులు మినుములో అంతర పంటగా కంది పంటను సాగు చేసేందుకు గతంలో రైతుకు ఉచితంగా విత్తనాలను అందజేసి ప్రోత్సహించారు. వారి సలహాలు, సూచనలతో ఎకరాకు నాలుగు బస్తాల దిగుబడిని సాధించారు.

రబీలో..

రబీ మొదలయ్యే సమయంలో పొదలకూరు, మనుబోలు, వెంకటాచలం వంటి మెట్ట ప్రాంతాల్లో రైతులు సాగునీటి వసతి లేని పొలాల్లో మినుము, పెసర సాగు చేస్తుంటారు. అయితే వ్యవసాయాధికారులు సూచన మేరకు మినుము, పెసర పంటల సాగుతోపాటు అంతర పంటగా కందిని సాగు చేస్తే మేలంటున్నారు. దీనికి అధిక వర్షపాతాన్ని తట్టుకునే స్వభావం ఉంటుంది. అంతే కాకుండా మార్కెట్‌లో డిమాండ్ ఉంది. ఒక క్వింటా ధర రూ.11 వేలు పలుకుతోంది. దీంతో రైతులు మెట్ట వ్యవసాయంలో నష్టపోకుండా కంది సాగు ద్వారా అధిక లాభాలు పొందే అవకాశం ఉంటుంది.

రైతులు ముందుకు రావాలి



అపరాల సాగులో అంతర పంటలు వేసేందుకు రైతులు ముందుకు రావాలి. ఈ పద్ధతి వల్ల అన్నదాతకు ఎలాంటి నష్టం వాటిల్లే అవకాశం ఉండదు. ఒక పంటలో నష్టం వచ్చినా మరో దానిలో లాభాలు వస్తాయి. రైతుల పంటల సాగు పద్ధతుల్లో మార్పు రావాలి.

ఎ.వాసు, ఏఓ, పొదలకూరు

నాటి గుర్తులు.. నేడిలా..

ముత్తుకూరు: స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ పాలనలో నెలకొల్పిన కట్టడాలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. గోపాలపురంలో తెల్లదొరల కాలం నాటి సాల్ట్ కార్యాలయం, ముత్తుకూరులో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం భవనాలు పూర్తిగా శిథిలమయ్యాయి. బ్రిటిష్ ఏలుబడిలో గూడూరు డివిజన్ కింద ముత్తుకూరు సబ్ తాలూకాగా కొనసాగింది. ప్రస్తుతం గురుకుల ఆశ్రమ పాఠశాల కొనసాగుతున్న 1920 నాటి భవనంలో నాడు తెల్లదొరల మేజిస్ట్రేట్‌లు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. 1980 దశకంలో ఇది పోలీసుస్టేషన్‌గా మారింది. నాటి ఆనవాళ్లు నేటికీ దర్శనమిస్తున్నాయి. ఈ భవనం మాత్రం చెక్కుచెదరకుండా దర్శమిస్తోంది. కృష్ణపట్నం పోర్టులో 16 ఏళ్ల క్రితం వరకున్న అందమైన పెంకుల కట్టడం తెల్లదొరల విహార కేంద్రంగా భాసిల్లింది. సెలవు రోజుల్లో అప్పటి దొరలు ఇక్కడ కుటుంబ సమేతంగా ఉండేవారు. ఈ ప్రాంతాన్ని 'ఆంగ్లర్స్ ప్యారడైజ్'గా పిలుచుకున్నారు. కృష్ణపట్నం పోర్టు అభివృద్ధిలో భాగంగా ఈ కట్టడాన్ని తొలగించారు.



బ్రిటిష్ కాలం నాటి కట్టడం.. నేడు గురుకుల పాఠశాల



శిథిలమైన బ్రిటిష్ కాలం నాటి ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్